క్లుప్తంగా

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడి, అధిక దిగుబడులు సాధించాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నాంపల్లె రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాలు ఎంపిక, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. అదేవిధంగా పంటల సాగులో తీసు కోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీపీఏలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ చిట్టిబాబు

బంగారుపాళెం: సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఏఓ చిట్టిబాబు అన్నారు. మండలంలోని మంగళపల్లె, కీరమంద, రాగిమానుపెంట గ్రామాల్లో మంగళవారం సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన వివరాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసమాచార అధికారి అందుబాటులో ఉంటారని, వారిని సంప్రదించి పౌరులు తమకు అవసరమైన సమాచారాన్ని కోరవచ్చన్నారు. అందుకు తగ్గ రుసుము చెల్లించి దరఖాస్తు అందజేయాలని సూచించారు. పౌరులు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, ప్రజాప్రతినిధులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



రెండు లేగ దూడలకు జన్మనిచ్చిన ఆవు

చిత్తూరు కలెక్టరేట్ : ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన సంఘటన నగరంలోని 12వ వార్డు నగిరిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆ వార్డులోని కట్టమంచి భార్గవ్‌రెడ్డి అనే రైతుకు పలు ఆవులు ఉన్నాయి. అందులో ఒక ఆవు మంగళవారం ఒకే ఈతకు రెండు లేగదూడలకు జన్మనిచ్చాయి. అవి రెండు ఆరోగ్యంగా ఉన్నాయి. ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం చాలా అరుదుగా జరుగుతుందని పశువైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. వాటిని చూసేందుకు స్థానికులు తరలివచ్చారు.

సంకరజాతి పేయ దూడలతో లాభాలు



మహిళా రైతుకు బహుమతిని ప్రదానం చేస్తున్న పశువైద్యులు

రొంపిచెర్ల: సంకరజాతి పేయ దూడలతో అధిక పాల ఉత్పత్తి జరిగి లాభాలు ఆర్జించ వచ్చని ఏపీ ఎల్‌డీఏ ఈఓ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం మద్దిపట్లవారిపల్లెలో పశుసంతతి పరిశీలన పథకంలో సంకర జాతి పేయ దూడల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ సంకర జాతి పేయ దూడలు మన ప్రాంతంలో అన్ని రకాల వ్యాధులను తట్టుకుంటాయన్నారు. అనంతరం ఉత్తమ పేయ దూడలను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు. ఏడీ శ్రీనివాసులనాయుడు, రొంపిచెర్ల, పెలిచెర్ల, సదుం, సోమల పశు వైద్యాధికారులు తబ్రీజ్‌బాషా, శ్రీహరి, మునిచంద్ర, ప్రదీప్, చందనప్రియ పాల్గొన్నారు.

వెలగని లైట్లు.. చీకట్లో గ్రామాలు



బైటపల్లి పంచాయతీ మద్దులయ్యగారిపల్లెలో వెలగని వీధిలైటు



పూతలపట్టు పంచాయతీ నాగిరెడ్డి పల్లెలో..



మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభం

గ్రామాలను చీకట్లు కమ్మేస్తున్నాయి. మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా అధికార యంత్రాంగంలో చలనం లేదు. గత నాలుగు నెలలుగా పూతలపట్టు మండలవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. సాయంత్రం అయితే చాలు గ్రామీణ ప్రజలు చీకట్లోనే మగ్గుతున్నారు. వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. దీంతో గ్రామీణ ప్రజలు త‌మ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లో పని చేయని వీధిదీపాలు
- మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- సర్పంచులు గ్రామాల్లో సమస్యలను విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువు
- వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన గ్రామాలపై కూటమి నేతల కక్ష
- ఇబ్బంది పడుతున్న పల్లె జనం

పూతలపట్టు: దేశం అభివృద్ధి బాటలో ముందుకు వెళ్తున్నా.. ఇప్పటికీ వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలెన్నో ఉన్నాయి. గత ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం సాకారం చేయాలన్న తలంపుతో గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తే.. కూటమి ప్రభుత్వం మాత్రం గ్రామాలను నిర్లక్ష్యం చేస్తోంది. పూతలపట్టు మండలంలోని కొన్ని గ్రామాల్లోని ఇప్పటికీ వీధిలైట్లు వెలగడం లేదు. అధికారులకు తెలిసినా స్పందన కరువు. గత ప్రభుత్వంలో అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో వెళ్లి సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించేవారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు చెప్పిన గ్రామాల్లో మాత్రమే వీధి దీపాలు వెలుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన గ్రామాల్లో మాత్రం కరెంటు కూడా సరఫరా చేయడం లేదు.

గ్రామాల్లో వెలగని దీపాలు..

ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటినా గ్రామాల్లో వీధిదీపాలకు మరమ్మతులు చేయలేని దుస్థితి నెలకొంది. మండలంలోని బైటపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వీధిదీపాలు వెలగడం లేదని స్థానిక సర్పంచ్ విద్యుత్ శాఖ ఏఈకి పలుమార్లు సమస్యను తెలిపినా స్పందన లేదు. అడిగినప్పుడు మాత్రం తప్పక చేస్తామని హామీ ఇచ్చి, తర్వాత పట్టించుకోవడం లేదు. ఆ సర్పంచ్ జూనియర్ లైన్‌మెన్‌కు పలుమార్లు ఫోన్ చేసి చెప్పినా దిక్కులేదు. రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగక, ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పూతలపట్టు మండలంలోని చాలా పంచాయతీల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో వీధుల్లో పాములు, తేళ్లు, విషపురుగులు తిరుగుతుండడంతో బయటకు రావడానికి భయపడుతున్నారు.

సర్పంచ్‌లు చెబితే కూడా లెక్కలేదు..

మండల సమావేశాల్లో సర్పంచులు తమ పంచాయతీ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే కనీస స్పందన ఉండడం లేదు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా ఉన్న సర్పంచ్‌లు చెబితే అసలే పట్టించుకోవడం లేదు. విద్యుత్ అధికారులకు కూడా సర్పంచ్‌లు డబ్బులు ఇస్తే తప్ప స్పందించడం లేదనే మాట వినిపిస్తోంది. రెండు వారాల కిందట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కూడా సర్పంచులు తమ గ్రామాల్లో వీధి దీపాలు వెలగడం లేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక పంచాయతీ పరిధిలో జరిగే గ్రామసభల్లో కూడా విన్నవించుకుంటున్నారు. కానీ అధికారుల వద్ద నుంచి సహకారం లేదు.

సమస్యను పరిష్కరించండి..

పంచాయతీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో పల్లెలో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వసభ్య సమావేశంలో, గ్రామసభల్లో ఎన్నోసార్లు వీధిలైట్ల సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాల్లో వీధిదీపాలను సరిచేయాలని కోరుతున్నాం. **- రామతులసి, సర్పంచ్, బైటపల్లి పంచాయతీ పూతలపట్టు**

సమస్యలను పరిష్కరిస్తాం



విద్యుత్ దీపాలు వెలగకుండా ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలను పరిష్కరిస్తాం. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటాం. **- నాగరాజు, ఎంపీడీఓ, పూతలపట్టు**

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



ఓటర్ల జాబితాను చూపుతున్న తహసీల్దార్ గుర్రప్ప

పూతలపట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ గుర్రప్ప ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ 173 పోలింగ్ నియోజకవర్గంలోని ఐరాల మండలంలో 45 బూత్‌లలో పురుషులు 20,282, స్త్రీలు 20,821 మొత్తం 41,103 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పూతలపట్టు మండలంలోని 42 బూత్‌లలో పురుషులు 18,404, స్త్రీలు 19,036, ఇతరులు 1 మొత్తం 37,441 మంది ఓటర్లు ఉన్నారని, తవణంపల్లి మండలంలోని 56 బూత్‌లలో పురుషులు 21,041, స్త్రీలు 21,974, ఇతరులు 1, మొత్తం 43,016 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. బంగారుపాళ్యంలోని 68 బూత్‌లలో పురుషులు 29,150 స్త్రీలు 30,337, ఇతరులు 1 మొత్తం 59,488 మంది ఉన్నట్లు తెలిపారు. యాదమరి మండలంలోని 51 బూత్‌లలో పురుషులు 20,150, స్త్రీలు 20,242, ఇతరులు 3 మొత్తం 40,395 మంది ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో 262 పోలింగ్ బూత్‌లలో పురుషులు 1,09,027, స్త్రీలు 1,12,410, ఇతరులు 6 మొత్తం 2,21,443 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు 444 మంది ఓటర్లు నమోదైనట్లు చెప్పారు. నవంబర్ 28వ తేదీ వరకు గడువుందని, అంతలోపు ఓటర్లలో మార్పులు, చేర్పులు ఉన్నట్‌లైతే ఆయా బూత్‌లలో బీఎల్వోలను సంప్రదించాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలయజేయాలన్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను బీఎల్వోలు నియోకవర్గంలోని పోలింగ్ బూత్‌లో అంటించారని, ఓటర్లు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మార్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ మహేశ్వరి, విలేకర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర

- డీఆర్‌ఓ పుల్లయ్య సేవలు మరువలేనివి
- వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



పుల్లయ్యను సత్కరించి, చిత్రపటం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో డీఆర్వో పుల్లయ్య కీలకపాత్ర పోషించారని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బదిలీపై వైఎస్సార్ కడప జిల్లాకు వెళుతున్న డీఆర్వో పుల్లయ్యకు మంగళవారం కలెక్టరేట్‌లో వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న పుల్లయ్య విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచారన్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించిన ఆయన సేవలు మరువలేనివని తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్‌ల అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వర్తించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. పుల్లయ్య మాట్లాడుతూ తాను చాలా మంది కలెక్టర్ల వద్ద పని చేసినట్లు తెలిపారు. కలెక్టర్ల ఆలోచనలకు అనుగుణంగా పనిచేసినట్లు చెప్పారు. ఎవరినీ నొప్పించని మనస్తత్వం ఉన్న కలెక్టర్ వద్ద డీఆర్వోగా విధులు నిర్వహించడం అదృష్టమన్నారు. చిత్తూరులో పనిచేసిన అనుభవం ఎప్పటికీ మరువలేనిదన్నారు. అనంతరం డీఆర్వో పుల్లయ్యను పలువురు అధికారులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూతన డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, డీఎస్ఓ శంకరన్, సంక్షేమ శాఖ అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, కలెక్టరేట్ సిబ్బంది రాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్

తవణంపల్లె: క్షయవ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 3 నెలల్లోపు గర్భిణులు, పుట్టిన బిడ్డల నమోదు తప్పక చేయించాలని ఆదేశించారు. పిల్లలకు వంద శాతం టీకాలు వేయించి నమోదు చేయించాలన్నారు. టీబీ, లెప్రసీపై ఇంటింటి సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాలకు గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల డయేరియా వ్యాపిస్తుందని, జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం తాగునీటి ట్యాంకుల్లో నీటి పరీక్షలతో పాటు క్లోరినేషన్ చేయించాలని వివరించారు. అంగన్‌వాడీ పిల్లలు, స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ మన బాధ్యత



బంగారుపాళెం: టోల్‌ఫ్రీ నంబర్ పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అటవీశాఖ అధికారులు

బంగారుపాళెం: వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని కొదలమడుగు గ్రామంలో అటవీశాఖ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను అటవీశాఖ అధికారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవుల్లో సంచరించే వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవుల్లో వేటగాళ్లు ఉచ్చులు వేసి వన్యప్రాణులను చంపుతున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠిన శిక్షలు అమలు చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. వేటగాళ్ల ఉచ్చులో పడి బంగారుపాళెం, యాదమరి మండలాల్లో చిరుత పులులు చిక్కుకుని మృత్యువాత పడిన సంఘటలను గుర్తు చేశారు. వన్యప్రాణులకు ముప్పు కలిగించే వారి పట్ల ప్రజలు 18004255909 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. ప్రకృతి ప్రసాదించిన వనసంపదను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ





కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఈఓ వరలక్ష్మి , కలెక్టర్‌ను కలిసిన నూతన పలమనేరు ఆర్డీఓ భవానీ శంకరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు విచ్చేసిన నూతన అధికారులు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. పలమనేరు ఆర్డీఓ భవానీశంకరి, డీఈఓ వరలక్ష్మి కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం గతంలో తాము పనిచేసిన ప్రాంతాల గురించి వివరించి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన అధికారులు విధుల పట్ల నిబద్ధతతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు నిస్వార్థ సేవలందించాలని ఆదేశించారు.

డీఈఓతో ఉపాధ్యాయ సంఘాల భేటీ



డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



డీఈఓను కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘు నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓ వరలక్ష్మిని పీఆర్‌టీయూ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంఘాల నాయకులు డీఈఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం జిల్లాలోని టీచర్ల సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, జిల్లా అధ్యక్షుడు మురళి, నాయకులు ప్రభుకుమార్, సంగీత, జయమ్మ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని బాబు నర్సింగ్ హోమ్‌లోని స్కానింగ్ సెంటర్‌ను మంగళవారం డీఐఓ హనుమంతరావు తనిఖీ చేశారు. స్కానింగ్ మిషన్, రికార్డులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, కొత్త స్కానింగ్ మిషన్‌పై పరిశీలన చేశారు. అలాగే అబార్షన్ మందుల వివరాలను ఆరా తీశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ఐదుగురు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని కాణిపాకం బైపాస్ రోడ్డులో పేకాట ఆడుతున్నట్లు సీఐ నెట్టికంఠయ్యకు మంగళవారం సమాచారం వచ్చింది. సీఐ ఆదేశాలతో ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టుచేసి, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కుప్పం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని శకుంతలతో వ్యాయామ ఉపాధ్యాయుడు

కుప్పం రూరల్ : కుప్పం మండలం, చందం, టి.సదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. చందం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శకుంతల మంగళవారం తిరుపతి జిల్లా మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్ -17 బేస్‌బాల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం మార్కొండనాయుడు తెలిపారు. సోమవారం సత్యవేడులో జరిగిన పోటీల్లో మండల పరిధిలో టి.సదుమూరు ఉన్నత పాఠశాలకు చెందిన నిత్యశ్రీ అండర్ -17 రగ్బీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం పద్మనాభరాజు తెలిపారు. చందం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, టి.సదుమూరు ఉపాధ్యాయుడు ప్రకాశ్‌ను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉలవసాగు లాభదాయకం



ఉలవ సాగును పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు(పులిచెర్ల) : ఉలవ సాగు లాభదాయకమని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తుదుంవారిపల్లె, చిన్న బెస్తపల్లెల్లో పర్యటించారు. తక్కువ నీటితో తక్కువ సమయంలో ఉలవ పంట చేతి కొస్తుందన్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నియోజకవర్గ నోడల్ అధికారి, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం బంగారుపాళెంలోని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 17 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు

ఐరాల: చిత్తూరు జిల్లా 17వ యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం అగరంపల్లె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 3, 4 తేదీల్లో పూతలపట్టు మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించనున్న విద్యాసదస్సుకు ఉపాధ్యాయులు, కార్యకర్తలు, మేధావులు తప్పక హాజరు కావాలని కోరారు. యూటీఎఫ్ సామాజిక స్పృహ కలిగి ఇటు ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యారంగ పురోభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తోందని హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యసేవలు



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష



దిగువమోదలపల్లెలో..

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో గర్భిణులకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగంపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 55 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు.

పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యమని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువ మోదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం లావణ్య, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు మున్సిపాలిటీకి అవార్డు



మంత్రి నారాయణ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు: పీఎం స్వనిధిసే సమృద్ధిలో భాగంగా 2023–24లో ఉత్తమ ప్రగతి సాధించినందున పలమనేరు మున్సిపాలిటీకి బెస్ట్ మున్సిపాలిటీ అవార్డు దక్కింది. ఆమేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ చేతులమీదుగా ఈ అవార్డును స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం అందుకున్నారు. మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ అర్బన్ ఏరియాస్ వారి ఆదేశాలతో ఇక్కడి మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి, ప్రగతి పారామీటర్ల ఆధారంగా ఈ అవార్డు దక్కింది. దీంతో స్థానిక మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరికి కృతజ్ఞతలను తెలిపింది. పాలక మండలి సహకారంతోనే రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.